క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సమావేశం

రామచంద్రపురం: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు బస్సు పాసుల పంపిణీ



బస్సు పాసులు అందిస్తున్న సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన వంద మంది విద్యార్థులకు నీలిమా ఐస్‌క్రీమ్ పార్లర్ అధినేత పితాని సుబ్రహ్మణ్యం ఆర్టీసీ బస్సు పాసులను అందజేశారు. హెచ్‌ఎం డీసీ అప్పారావు అధ్యక్షతన గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఈ ఏడాది ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తామన్నారు.

చవితి వేడుకలకు రాట ముహూర్తం



వైఎస్సార్ నగర్‌లో రాట ముహూర్తం చేస్తున్న స్థానికులు

రామచంద్రపురం: పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే వరసిద్ధి వినాయక గణపతి నవరాత్ర మహోత్సవాలకు గురువారం స్థానికులు రాట ముహూర్తం చేశారు. వచ్చే నెల 7న చవితి వేడుకలు ప్రారంభించేందుకు ఈ రాట ముహూర్తాన్ని కృష్ణ పండితులు చేతులమీదుగా నిర్వహించారు.

అంగరలో..

కపిలేశ్వరపురం: అంగర ఆదిగణపతి సెంటర్‌లో గురువారం గణపతి నవరాత్ర ఉత్సవాల నిర్వహణకు పందిరి రాట ముహూర్తం చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పెద్దింశెట్టి సూర్యచంద్రరావు చేతుల మీదుగా పూజలు చేయించారు.ఈ కార్యక్రమంలో మేడేపల్లి కొండ, పెద్దింశెట్టి వీరబాబు, పసలపూడి కృష్ణ, కొండిపూడి శ్రీరాములు, యర్రంశెట్టి రమణ, మేకా భద్రరావు, పడాల రామకృష్ణ, యానాల సుబ్బారావు, శనివారపు అచ్చన్న పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలి

కాజులూరు: సాగులో సేంద్రియ ఎరువుల వాడకానికి రైతులు ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయాధికారి వి అశోక్ అన్నారు. గురువారం చేదువాడలో ఆయన రైతులతో మాట్లాడారు. రసాయనిక ఎరువుల రేట్లు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. దీంతో సాగు ఖర్చు పెరిగి, పంట ఉత్పత్తులు విషతుల్యమవుతున్నాయని చెప్పారు. విత్తనశుద్ధికి జీవామృతం వినియోగం, సస్యరక్షణకు గోవు పేడ, మూత్రం కషాయం, వేప కాషాయం వంటివి వినియోగించవచ్చన్నారు. పురుగు మందుల అవశేషాలు లేని, నాణ్యమైన ఉత్పత్తులను రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పీఓ)ల ద్వారా రైతులు అధిక ధరలకు విక్రయించుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయ శాఖ వద్ద నమోదు చేసుకోవాలన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మామిడికుదురు: విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగరం ఎస్సై చైతన్యకుమార్ హెచ్చరించారు. మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన గురువారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. విద్యా వ్యవస్థలో ర్యాగింగ్‌పై నిషేధం ఉందని ఎస్సై చెప్పారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వెంటనే సమాచారాన్ని అధ్యాపకులకు తెలపాలన్నారు. ర్యాగింగ్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల వైపు యువత మళ్లకుండా, శ్రద్ధగా చదువుకోవాలని హితవు పలికారు. విద్యార్థినులతో గౌరవంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రిన్సిపాల్ మోకా రంగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అపోహలు విడనాడాలి

అంబాజీపేట: నేత్రదానం చేయడంలో ఉన్న అపోహలను విడనాడి, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయడాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మండల ఆప్తాలమిక్ అధికారి వి.ప్రభాకర్ అన్నారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు జరిగే జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పబ్బినీడి రాంబాబు, అంబాజీపేట ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి మూలాలను వెతకాలి



మహిళలపై హింస అనే సమస్యకు పరిష్కారాన్ని సామాజిక మూలాల నుంచి వెతకాలి. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్య ఘటన యావత్ ప్రపంచాన్ని కలచివేసింది. ఘటనను నిరసిస్తూ ప్రజలంతా రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేయడం ప్రజా చైతన్యానికి నిదర్శనం, ప్రభుత్వాలు వ్యవస్థలను సమర్థవంతంగా పని చేసే దిశగా పాలన సాగించాలి.

– డాక్టర్ చల్లా మెహర్ ప్రసన్న, హోమియో వైద్యురాలు, గౌతమి హోమియో వైద్యశాల, మండపేట



వైద్యులకు ప్రశాంత వాతావరణం కల్పించాలి



కోల్‌కతాలోని వైద్య కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ట్రైనీ వైద్యురాలిపై జరిగిన పాశవిక హత్యాచారం ఘటన దేశంలోని మహిళా వైద్యులందరికీ తీవ్ర భయాందోళనలు కలిగిస్తోంది. ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే వైద్యులు పనిచేసే ప్రదేశాల్లో ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలి. వైద్యులు భయపడుతూ పని చేస్తుంటే, ఇక ప్రజలకు ఏ విధంగా మెరుగైన సేవలందించగలరు? ప్రజలకు ప్రాణం పోసే డాక్టర్లకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటి? వైద్యులతో తప్పుడుగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రత్యేక చట్టాలు తేవాలి. – ఎస్ సౌజన్య, వైద్యురాలు, గొల్లపాలెం పీహెచ్‌సీ

అడుగు పడేదెలా!

- రహదారులు గుంతలమయం
- జారిపడుతున్న జనం
- 'కూటమి' వస్తే రహదారులకు మహర్దశ అంటూ ప్రచారం
- తీరా ప్రభుత్వం వచ్చాకా పట్టించుకోని వైనం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని సంక్షేమం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జరిగింది. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుకూ ప్రభుత్వం నుంచి చేయూతనిచ్చింది. మధ్యవర్తులు లేకుండా పైసా అవినీతి జరగకుండా నేరుగా సకాలంలో వలంటీర్ ద్వారా లబ్ధి అందేది. అంత మహత్తరమైన పాలనలో తలకుమించిన భారాన్ని అప్పటి ప్రభుత్వం ప్రజలు కోసం మోసింది. అలాంటి భారాల నడుమ అక్కడక్కడా రహదారుల త్వరితగతిన నిర్మించలేకపోయినందుకు అప్పటి ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేశాయి. సార్వత్రిక ఎన్నికల్లో అయితే వారు చేసిన దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. కూటమి ప్రభుత్వం వస్తే రహదారులకు మహర్దశ వస్తుందంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రసంగాలు ఊదరగొట్టారు. కారణాలేమైతేనేమి కూటమి ప్రభుత్వం వచ్చింది. మూడు నెలలు గడుస్తున్నా రహదారులను పట్టించుకున్న తీరు ఎక్కడా కానరావడంలేదు.

కపిలేశ్వరపురం: ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారాయి. అడుగుకో గుంత ఎదురవుతుండడంతో ప్రయాణికులు జారి పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు గుంతలు నీటితో నిండుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రయాణాల్లో తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండపేట నియోజకవర్గంలో మండపేట-కపిలేశ్వరపురం రహదారిలో ప్రయాణాలు ప్రమాదాలకు నిలయంగా మారింది. నియోజకవర్గ కేంద్రమైన మండపేటకు కపిలేశ్వరపురం మండలంలోని నేలటూరు, వల్లూరు, వెదురుమూడి, అంగర, పడమర ఖండ్రిక, టేకి, కపిలేశ్వరపురం తదితర గ్రామాల ప్రజలు అంగర-మండపేట ఆర్‌అండ్‌బీ రహదారిపై ప్రయాణిస్తారు. ఈ రహదారిలో అంగర కల్యాణ మండపం, వెదురుమూడి పెద్ద వంతెన, చర్చివద్ద, వల్లూరు కాలువగట్టు వద్ద రహదారి లోతైన గోతులు ఏర్పడ్డాయి.

కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి- మండల కేంద్రమైన ఆలమూరులకు వెళ్లే రహదారి పొడవునా గోతులు ఉన్నాయి. గజ్జరపువారి సావిడి, రైసు మిల్లు, సంధిపూడి సమీపాన రహదారి ఛిద్రమైంది. ఆలమూరు కోర్టు, రిజిస్ట్రార్ కార్యాలయం, రాజమహేంద్రవరాలకు వెళ్లే వారితో రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. రైసుమిల్లులు, ఇటుక బట్టీలు, ఇతర వాణిజ్య కార్యకలాపాలతో రహదారి మీదుగా వాహనాలు నిత్యం తరలివెళుతుంటాయి. రహదారి ఛిద్రం కావడంతో జనం నరకం చూస్తున్నారు. మండపేట- గుమ్మిలేరు రహదారి గుంతలమయమైంది. మండపేటలోని పెద్దకాలువ నుంచి గుమ్మిలేరు టోల్‌గేటు వరకూ రహదారి పాడైపోయింది. కాకినాడ-విజయవాడ బస్సులు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతలను తప్పుకుని బస్సులు వెళ్లాల్సి వచ్చినప్పుడు ట్రాఫిక్ జాం అవుతుంది. మండపేట-ఏడిద రోడ్డు గుంతలమయమైంది. ఈ రహదారి వెంబడి రైసుమిల్లులు ఉండడంతో వాహనాలతోపాటు శ్రామికులు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు.



వెదురుమూడి చర్చి సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారి దుస్థితి

గోదావరి గట్టు ఛిద్రం

ఆలమూరు మండలం జొన్నాడ-యానాం గౌతమి గోదావరి గోదావరి గట్టు ఛిద్రమైంది. ఈ రహదారిలో కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లోని ర్యాంపుల వద్ద ఇసుక నిల్వలున్నాయి. వాటిని ఇటీవల కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పేరుతో విక్రయాలు సాగిస్తోంది. ఇసుక తరలింపు వ్యవహారం ఎలా ఉన్నా భారీ వాహనాల రాకపోకలతో గోదావరి గట్టు ఛిద్రమైంది. స్టాక్ పాయింట్ల వద్ద హద్దు పొద్దూ లేకుండా వాహనాలను క్రమ రహితంగా అనుమతించడంతో రహదారి గోతులమయమైంది. అటుగా వెళ్లేందుకు ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజా ప్రయోజనాలను పట్టించుకునే దిశగా పాలన సాగించాలని ప్రజలు కోరుతున్నారు. తక్షణ అవసరంగా గుంతలను పూడ్చాలని కోరుతున్నారు. తగిన నిధులను మంజూరు చేసి త్వరితగతిన రహదారులను నిర్మించాలంటున్నారు.

నిధులు మంజూరైతే..

ఈవిషయమై ఆర్‌అండ్‌బీఐ అధికారులను వివరణ కోరగా ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే నిర్మాణాలు చేపడతామని తెలిపారు.



ఛిద్రమైన కపిలేశ్వరపురం గోదావరి గట్టుపై రాకపోకలకు అవస్థ పడుతున్న వాహనదారులు

మండల కేంద్రం రహదారి అధ్వానంగా ఉంది



మండల కేంద్రమైన కపిలేశ్వరపురం ఆర్‌అండ్‌బీ రహదారి ఛిద్రమై అధ్వానంగా ఉంది. లోతైన గుంతలు పడి ఉండడంతో ద్విచక్రవాహనదారులు జారిపడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, ఉద్యోగులు, ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి రహదారిని నిర్మించాలి.

– పీతల శ్రావణ్‌కుమార్, కపిలేశ్వరపురం

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



సార్విక్ తల్లిదండ్రులకు మొత్తాన్ని అందిస్తున్న మల్లిడి దంపతులు

మండపేట: అనారోగ్యంతో బాధపడుతున్న సార్విక్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం మండపేటకు చెందిన రోటరీ క్లబ్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మల్లిడి శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి దంపతులు గురువారం ఆర్థిక సాయం అందించారు. పట్టణానికి చెందిన మందపల్లి ప్రసాద్, దివ్యల మూడేళ్ల కుమారుడు సార్విక్‌బోన్ మారో సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యానికి రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. పేదరికంలో ఉన్న ప్రసాద్ దంపతులు ఇప్పటికే ఉన్నంత వరకూ ఖర్చు చేసి వైద్యం అందించారు. ఇంకా ఏమీ చేయలేక దాతల సాయం కోరారు. దీంతో సోషల్ మీడియాలో సార్విక్ సమస్యను చూసి శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి దంపతులు తమ వంతు సాయంగా విరాళాలు సేకరించి రూ.50,350 మొత్తాన్ని గురువారం ప్రసాద్ దంపతులకు అందజేశారు. వీరితోపాటు చింతా రామకృష్ణారెడ్డి, వీరలక్ష్మి, సత్తి వెంకటరెడ్డి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కపిలేశ్వరపురం: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారి వై.విజయానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకూ కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి గ్రామాల్లో నిర్దేశించిన సమయాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు తపాలా శాఖ స్కాలర్‌షిప్

రామచంద్రపురం: తపాలా బిళ్లల సేకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం దీన్ దయాళ్ స్పర్శ్ యోజన ప్రవేశపెట్టిందని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కె శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద తపాలా బిళ్లలను సేకరించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తారన్నారు. చదువులో మంచి ప్రతిభ కనబరచి, స్టాంపులు సేకరించే 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ ద్వారా నెలకు రూ 500 చొప్పున, ఏడాదికి రూ.6 వేలను అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థి కనీస అర్హత 60 శాతం మార్కుల ఉత్తీర్ణత ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం సడలింపు ఉంటుందని చెప్పారు. పాఠశాలలో ఫిలాటిలీ క్లబ్ ఉండాలని, విద్యార్థులు అందులో సభ్యులై ఉండాలన్నారు. ఒకవేళ ఫిలాటిలీ క్లబ్ లేకపోతే, విద్యార్థికి పోస్టాఫీసులో ఫిలాటిలీ ఖాతా ఉండాలని తెలిపారు. విద్యార్థిరి సెప్టెంబర్ 30న రాత పరీక్ష ఉంటుందని, ఇందులో గెలుపొందిన విద్యార్థులు రెండో దశలో ఫిలాటిలీ ప్రాజెక్టును సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల కోసం సమీపంలోని తపాలా కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తులను పోస్ట్‌మాస్టర్ జనరల్, విశాఖపట్నం రీజియన్, విశాఖపట్నం -530017 వారికి ఫిలాటలీ స్టాంపును జత చేసి, స్పీడ్ పోస్ట్ ద్వారా మాత్రమే సెప్టెంబర్ 16లోగా పంపించాలని తెలిపారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

కాజులూరు: రాజమహేంద్రవరం డిపో నుంచి మంజేరుకు ప్రయాణించే ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు గురువారం కాజులూరులో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ, రాజమహేంద్రవరం నుంచి రామచంద్రపురం, ద్రాక్షారామ మండలంలోని కుయ్యేరు, దుగ్గుదుర్రు, కాజులూరు, చేదువాడల మీదుగా నిత్యం ఓ బస్సు నాలుగు పర్యాయాలు మంజేరుకు వచ్చి వెళ్లేదన్నారు. కరోనా లాక్‌డౌన్ కారణంగా బస్సును నిలుపుదల చేసిన అధికారులు, కొన్ని రోజుల తర్వాత పునరుద్ధరించినప్పటికీ, మరలా నిలిపి వేశారన్నారు. రామచంద్రపురం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉన్న ఈ సర్వీసును పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలన్నారు. మంజేరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గండి గోపాలం, చేదువాడ సర్పంచ్ గంజా సూరిబాబు, కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యాంబ అమ్మవారికి సారె



మాణిక్యాంబ అమ్మవారికి సారె తీసుకొస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా, పంచారామ క్షేత్రంగా విరాజిల్లుతున్న మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన చక్రి స్వీట్స్ యజమాని కంచర్ల చక్రధరరావు, వీరవేణి దంపతుల ఆధ్వర్యంలో మాణిక్యాంబ అమ్మవారికి గురువారం సారె అందజేశారు. గ్రామంలోని గీతా మందిరం నుంచి మహిళలు స్వీట్లు చేతపట్టి, కాలినడకన డోలు సన్నాయి మేళంతో వచ్చారు. అనంతరం ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చరణల మధ్య స్వీట్లు సారెగా అందజేశారు. అమ్మవారి సన్నిధిలో లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పితాని తారకేశ్వరరావు, మాస శివరాత్రి కమిటీ వ్యవస్థాపకులు, శ్రీరాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రొయ్యల సాగు నిలిపివేయాలని ధర్నా



పాతకోటలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రామచంద్రపురం రూరల్: పాతకోట గ్రామంలో పొలాల మధ్య, ఊరికి చేర్చి ఉన్న చెరువుల్లో రొయ్యల సాగు నిలిపివేయాలంటూ గ్రామానికి చెందిన మహిళలు గురువారం ధర్నా చేపట్టారు. రోడ్డుపైనే వంటా-వార్పు చేపట్టి నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన సుమారు మూడెకరాల చెరువుల్లో అనుమతులు లేకుండా రొయ్యల సాగు చేస్తున్నారని గ్రామస్తులు కొంత కాలం నుంచి నిరసన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా చెరువుల నిర్వాహకులు మరోసారి రొయ్యల సాగు చేసేందుకు సీడ్ వేస్తుండగా, గ్రామస్తులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్డుపైనే వంటలు చేసుకుని, అక్కడే భోజనాలు చేసి ఆందోళన కొనసాగించారు. కె.గంగవరం పోలీసులు, తహసీల్దార్ కె.సూర్యారావు, మత్స్యశాఖ అధికారులు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సూర్యారావు మాట్లాడుతూ, చెరువులపై సమగ్రంగా విచారణ జరిపి, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. అంతవరకు రొయ్యల సాగు నిలిపివేస్తున్నామని ప్రకటించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్ గ్రామస్తుల ఆందోళనకు మద్దతు పలికారు. అక్రమ రొయ్యల సాగు వల్ల భూగర్భ జలాలు కలుషితమై, పొలాలు దెబ్బతింటున్నాయన్నారు. గ్రామస్తుల ఆవేదనను పరిగణనలోనికి తీసుకుని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

భావి తరాలకు తెలుగు మాధుర్యాన్ని అందించాలి

రామచంద్రపురం: తెలుగు భాష ఉనికిని కాపాడుకోవడంతో పాటు, తెలుగు మాధుర్యాన్ని, ఔన్నత్యాన్ని భావితరాలకు అందించే కృషి నిరంతరం సాగాలని వక్తలు అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య కార్యాలయంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, తెలుగు భాష నుడికారం ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేసి, భాషపై మమకారాన్ని కలిగించాలని సూచించారు. సమాఖ్య, అడ్డూరి పద్మనాభరాజు సాహితీ వేదిక సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దినవారీ హాజరుపట్టీలో తెలుగులోనే సంతకం చేయాలనే నిబంధనను పాటిస్తూ, వచ్చిన సభ్యులు నలమాటి సత్యనారాయణ, దివినీడి శ్రీరాములును ఘనంగా సత్కరించారు. సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పట్నాల రామకృష్ణారావు, తటవర్తి రాఘవరాజు, పలివెల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

రామచంద్రపురం: కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా, కేసి సత్యలత



సత్యనారాయణ, శ్రీరాములును సత్కరిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

మాట్లాడుతూ తెలుగు భాష వాడుక భాషగా కావడానికి జీవితమంతా పోరాటం చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. నిత్యం ఆటలు ఆడాలని, తద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఏసియన్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి వరుణ్‌కు కళాశాల తరపున అభినందించారు.

ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవం

రాయవరం: మండలంలో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వీఎస్ సునీత అధ్యక్షతన కార్యక్రమంలో జరిగింది. సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.దయామణి



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం ఎస్‌ఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ సారిక ధనలక్ష్మి, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చక్కని దస్తూరి, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి వెలగల ఫణికృష్ణారెడ్డి సౌజన్యంతో విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుతగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి, తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డిగ్రీ కళాశాలలో..

మండపేట: మండలంలోని ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం కాలేజీ ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ బి.సుబ్బలక్ష్మి హాజరయ్యారు. మాతృభాష పరిరక్షణ బాధ్యత తెలుగువారి అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అనంతరం డాక్టర్ బి.సుబ్బలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ మధుకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనంద్ అకాడమిక్ కోఆర్డినేటర్ కె.శంకర్ నారాయణ, డాక్టర్ కేఎస్‌ఆర్ రాము, చంటి, దిలీప్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత:

సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని హెచ్‌ఎం ఆర్.దయామణి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన తాడి వీరవెంకటరామచంద్రారెడ్డి రూ.20వేలు విలువైన క్రీడా పరికరాలను పాఠశాలకు అందజేశారు. ఏటా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.25వేలు పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలకు అందజేయనున్నట్టు దాత రామచంద్రారెడ్డి తెలిపారు. ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు భాషా పండితులు శ్రీనివాసరెడ్డి, చిర్రా వెంకటమోహన్, వ్యాయామ ఉపాధ్యాయుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో స్పోర్ట్స్ డే, తెలుగు భాషా దినోత్సవం

మండపేట: మండలంలోని ద్వారపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్పోర్ట్స్ డే, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో తెలుగు పండితులు గిడుగు రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్ర పటాలను వుంచి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు



రాయవరం జెడ్పీ హైస్కూల్‌లో విజేతలకు బహుమతులిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



సోమేశ్వరంలో క్రీడా పరికరాలు, క్రీడా దుస్తులు అందజేసిన దాత రామచంద్రారెడ్డి

కోతుల బెడదను నివారించాలి



తణుకువాడలో పొలాల మధ్య సంచరిస్తున్న కోతులు

కాజులూరు: మండలంలోని తణుకువాడలో ఇటీవల కోతుల గుంపులు రైతులను తీవ్ర నష్టాన్ని చేకూరుస్తోన్నాయి. కొబ్బరి చెట్లపై కాయలు తుంచడం, కూరగాయలు, పూలతోటలపై దాడి చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లపై పరుగులు తీయడంతో తాటాకిళ్లు, పెంకుటిళ్ల పైకప్పులు ధ్వంసమవుతున్నాయి. చిన్నారులు మహిళలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయాందోళన చెందుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపైనా కోతులు దాడులు చేస్తాయని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. తాళ్లరేవు అభయారణ్యం సమీపంలో ఉండడంతో, అక్కడి నుంచి కోతుల గుంపులుగా గ్రామాల్లోకి చొరబడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి, కోతుల బెడదను నిరోధించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వెల్లివిరిసిన దాతృత్వం

మామిడికుదురు: అమెరికాలో ఇంజినీర్‌గా స్థిరపడిన ఆదుర్రు గ్రామానికి చెందిన డాక్టర్ ఉపాధ్యాయుల లక్ష్మీనరసింహచైనులు, అన్నపూర్ణ దంపతులు దాతృత్వాన్ని చాటుకున్నారు. తమ స్వగ్రామం ఆదుర్రులో సొంత నిధులు రూ.26 లక్షల వ్యయంతో రెండు గదులతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అదనపు భవనాన్ని నిర్మించారు. తాను చదివిన స్కూల్‌కు లక్ష్మీనరసింహచైనులు సొంత ఖర్చుతో భవనం నిర్మించారు. దాని తాళాలను గురువారం సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ గెడ్డం మహాలక్ష్మమ్మ, గ్రామ పెద్దల సమక్షంలో హెచ్‌ఎం యాళ్ల పళ్లంరాజుకు అప్పగించారు. దాత కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.